క్లుప్తంగా

షాకు తిరుపతి లడ్డూ బహూకరణ



అమిత్‌షాకు లడ్డూను అందజేస్తున్న సౌమ్యారెడ్డి

కుల్కచర్ల: జిల్లా కేంద్రంలో బీజేపీ నిర్వహించిన భారీ భహిరంగ సభకు వచ్చిన కేంద్ర మంత్రి అమిత్‌షాకు.. మాజీ సర్పంచ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం తిరుమల తిరుపతి లడ్డూను బహూకరించారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట నిఘా

ఎంపీడీఓ శ్రీదేవి

బొంరాస్‌పేట: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. శుక్ర, శనివారాల్లో మండల పరిధి పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, వృద్ధులకు, దివ్యాంగులకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితా, సిబ్బంది పనితీరు, ఇంటింటికీ పోలింగ్ చిట్టీల సరఫరా పూర్తయిందని వెల్లడించారు.

తలంబ్రాల బుకింగ్‌లో పరిగి డిపో నంబర్ వన్



విశ్వనాథంను సన్మానిస్తున్న అధికారులు

పరిగి: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్‌లో రాష్ట్రంలోనే పరిగి ఆర్టీసీ డిపో మొదటి స్థానంలో నిలిచింది. బుకింగ్‌లో ప్రథమస్థానం, డిపోకు ఆదాయం తీసుకురావడానికి కృషి చేసిన డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విశ్వనాథంను శనివారం నగరంలోని ఆర్టీసీ ట్రెనింగ్ కళాశాలలో సంస్థ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. మునుముందు అధిక ఆదాయం తీసుకు వచ్చే విధంగా మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

ప్రజాదరణ పొందిన వీధినాటకం

బొంరాస్‌పేట: జానపద కళలైన యక్షగానం, వీధి నాటకాలను ప్రోత్సహించాలని మాజీ సర్పంచ్ సుమిత్ర అన్నారు. మండల పరిధి దుప్‌చర్లలో గత నెల 29 నుంచి రోజు విడిచి రోజు రాత్రి పూట ప్రదర్శిస్తున్న మల్లికార్జున స్వామి భక్తిరస వీధినాటకానికి ప్రజాదరణ లభించింది. 56 పాత్రలున్న నాటకంలో గ్రామంలోని 36మంది పాత్రధారులున్నారు. ఈ సందర్భంగా నాటకోపాధ్యాయుడు కొత్తూరు వెంకటయ్యను పాత్రధారులు, గ్రామ పెద్దలు సన్మానించారు.


కాసాని విజయం ఖాయం

మర్పల్లి: బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ జిల్లా నాయకులు నర్సింలు ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధే కాసానిని గెలిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

నమ్మి మోసపోవద్దు

దోమ: కాంగ్రెస్ పార్టీని మరోసారి నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎంపీటీసీ రాములు అన్నారు. శనివారం మండల పరిధి బొంపల్లిలో బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి, ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ రఫీక్ పాష ఉన్నారు.

ఆటలతో ఆరోగ్యం



బహుమతులు అందుకుంటున్న ఆటగాళ్లు

బొంరాస్‌పేట: ఆటలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలంగాణ జానపద కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య తెలిపారు. మండల పరిధి రేగడిమైలారంలో శనివారం వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత ఆధ్యాత్మికం, ఆటలకు దూరమై దురలవాట్లకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వేసవి సెలవుల్లో ఇష్టమైన క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేత జట్లకు నగదు బహుమతులు అందజేశారు. ఇందులో వెంకటయ్య, కాశప్ప, వెంకటేష్, సురేష్, శివ, కైలాస్, నరేష్, రఘుపతిరాజు ఉన్నారు.

అమిత్ 'షో'..



కేంద్ర మంత్రి అమిత్‌షా మాటలకు చేతులెత్తి అంగీకారం తెలుపుతున్న ప్రజలు

- కార్యకర్తల్లో ఫుల్ జోష్
- కేంద్ర మంత్రి ప్రసంగానికి కరతాల ధ్వనులతో మార్మోగిన సభాప్రాంగణం
- ఆకట్టుకున్న భారీ కటౌట్లు

అనంతగిరి/ధారూరు/బంట్వారం: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ అనంత పద్మనాభ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి వచ్చారు. ప్రచారం ముగింపు సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తదితర అగ్రనేతల ప్రసంగాలతో.. ఆద్యంతం కమలనాథుల్లో జోష్ నింపింది. షా ఉపన్యాసానికి ఈలలు వేస్తూ.. చిందులు వేశారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేద్దామా వద్దా అని మంత్రి ప్రశ్నించగా.. ప్రజలంతా చేతులు పైకి ఎత్తి అంగీకారం తెలిపారు. పువ్వు గుర్తుకు ఓటువేసి, పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరగా.. కరతాల ధ్వనులతో.. తమ ఓటు కమలం గుర్తుకే అంటూ నినదించారు. రైల్వే గురించి మాట్లాడుతూ.. బుల్లెట్ ట్రెయిన్ ఫస్ట్ స్టాఫ్ వికారాబాద్‌కు అనగానే ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానుల నుంచి వచ్చిన స్పందనను చూసిన అమిషా.. సంతోషం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా.. సభను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ, ప్రాంతీయ నాయకుల చిత్రాలతో కూడిన భారీ కటౌట్లతో ప్రాంగణమంతా కాషాయ వర్ణంతో కనిపించింది. అమితా హెలికాప్టర్‌ను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.



బీజేపీ జెండాలు, ప్రధాని మోదీ చిత్రపటాలతో యువత



హోం మంత్రి వస్తున్న హెలికాప్టర్‌ను చూస్తున్న ప్రజలు



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కటౌట్లు

మోదీ పాలనలో దేశం సుభిక్షం

- ఎవరెన్ని కుట్రలు చేసినా.. బీజేపీ హ్యాట్రిక్ విజయం ఖాయం
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు



ధారూరు: ప్రచారం చేస్తున్న కమలనాథులు

ధారూరు: దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మోదీని మరోసారి ప్రధానిని చేయాలని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. అనంమాట్లాడారు. పదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు. ఎక్కడా కూడా మతకల్లోలాలు, ఘర్షణలు జరిగిన దాఖలాలు లేవని చెప్పారు. దశాబ్దాల రామ మందిర నిర్మాణం కల నెరవేరిందని వెల్లడించారు. రేపటి ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి, పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆదరించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు పాండుగౌడ్, ఎస్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజునాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, వైద్యనాథ్ ఉన్నారు.

యువత తోడ్పాటునివ్వాలి

దోమ: మోదీ హ్యాట్రిక్ విజయం సాధించాలంటే యువత తోడ్పాటునివ్వాలని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధి మోత్కుర్ గ్రామంలో పలువురు యువకులు శరత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని గత ప్రభుత్వం పదేళ్లుగా పాలించి అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేస్తూనే ఉందని మండిపడ్డారు. దేశాభివృద్ధికి పాటుపడే మోదీ.. మరలా విజయం సాధించాలంటే యువత శ్రమించి, ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వెల్లడించారు.

పలువురి చేరిక..

బంట్వారం: బీఆర్‌ఎస్ ఉమ్మడి బంట్వారం మండల మాజీ అధ్యక్షుడు రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సమక్షంలో వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కాషాయం కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన పై అపారమైన విశ్వాసంతోనే బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ వడ్ల నందు ఉన్నారు.

షా సభకు తరలిన శ్రేణులు

కుల్కచర్ల: జిల్లా కేంద్రంలో జరిగిన అమిత్‌షా భహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. కుల్కచర్ల మండల అధ్యక్షుడు సురేష్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్యాల ఆధ్వర్యంలో కార్యకర్తలు సభకు వెళ్లారు.

రంజిత్‌వి దిగజారుడు రాజకీయాలు



అనంతగిరి: మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం మధ్యాహ్నం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొండా మాట్లాడారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. నా వెంట చేవెళ్ల ప్రజలు ఉన్నారని, కులమతాలకు అతీతంగా మద్దతు ఇస్తున్నారని ధీమా వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో పరుగు తీస్తుందని, అర్హులందరికీ సమన్యాయం సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. అందుకే దేశ ప్రజలంతా మరోసారి మోదీని ప్రధానిని చేయాలని డిసైడ్ అయ్యారని వెల్లడించారు. చేవెళ్ల ప్రజలు తనను మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీరిదిద్దుతానని కొండా స్పష్టం చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ఉన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు



షాద్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వాటర్ ప్రూఫ్ టెంటు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని మినీస్టేడియంలో ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ సిబ్బందికి అధికారులు సామగ్రి పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా టెంట్లు వేసి, టేబుళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,38,478 మంది ఓటర్లు ఉండగా మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 1200 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. స్ట్రాంగ్‌రూంను ఆదివారం ఉదయం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో తెరిచి ఈవీఎం పోలింగ్ సిబ్బందికి అప్పగించనున్నారు. పోలింగ్ సిబ్బంది గ్రామాలకు వెళ్లేందుకుగాను ఎన్నికల సంఘం అధికారులు ప్రత్యేకంగా బస్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందితో పాటుగా, స్పెషల్ ఫోర్స్‌ను నియమించారు. పోలీసులు గ్రామాలకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మినీ స్టేడియంలో ప్రత్యేక వాటర్ ప్రూఫ్ టెంటును వేస్తున్నారు.

'బూర' గెలుపే లక్ష్యం

మంచాల: పార్టీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాషయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధిలో ముందుకు సాగాలంటే బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఉందని, కమలం గుర్తుకు ఓటు వేసి, ఎంపీగా బూరను ఆశీర్వదించాలని కోరారు. ఇందులో శ్రీనివాస్, యాదగిరి, కృష్ణ, శ్రీను, రాములు, సైదులు, శేఖర్, పరమేష్ ఉన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను



ఆమనగల్లు: 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కల్వకుర్తి ఆర్డీఓ, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీను తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో శనివారం ఆయన పర్యటించి పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,44,405 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గతంలో 262 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా మైసిగండి, గడ్డమీది తండా, కంటోనిపల్లి, ఉప్పలగట్టు తండా, కేస్లీతండా, గౌరారం, శంకరకొండ తండా, గోవిందాయిపల్లి తండా, పెద్దవేములోని బావితండాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కల్వకుర్తి పరిధిలో 66 సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను గుర్తించినట్లు, దాని కోసం పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరారన్నారు. ప్రతీ ఓటరు ఓటు వినియోగించుకోవాలని ఆర్డీఓ కోరారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీకాంత్

తలకొండపల్లి: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 14వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో, పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమావేశాలు, సభలు, ర్యాలీలు నిషేదమన్నారు. జనం గుంపులు, గుంపులుగా ఉండొద్దని, ఐదుగురి కంటే ఎక్కువ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం



తాండూరు టౌన్: పాత తాండూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

- కాంగ్రెస్, బీజేపీలను విశ్వసించని ప్రజలు
- బీసీబిడ్డ కాసానికి జనం నీరాజనం
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

నవాబుపేట: లోక్‌సభ కురుక్షేత్రంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమైందని, బీసీబిడ్డకు ప్రజలు పట్టం కట్ట నున్నారని ఆ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి రాంబాబు ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదని చెప్పారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, ప్రజలు ఆ పార్టీకి గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. దేవుడు, మతం పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీకి చివరకు నిరాశే మిగలనుందని జోష్యం చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. తెలంగాణ ప్రజలు కారు గుర్తుకు ఓటువేసి, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించనున్నారని వెల్లడించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఎంపీటీసీలు విజయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, నాయకులు ప్రకాశం, అజయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, శాంతకుమార్ ఉన్నారు.

ఓటును వృథా చేసుకోవద్దు..

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసగించిందని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని రాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్ నగర్, పాత తాండూరులో బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా పైలట్ విస్తృత ప్రచారం. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేయడంతో పాటు, తిరిగి పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించాలని కోరడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కరెంటు కోతలు పెరిగిపోయాయని మండిపడ్డారు. తాగు నీటి సరఫరా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలు నిలిచిపోయాయని తెలిపారు. చేవెళ్లకు రంజిత్ రెడ్డి చేసిందేమీ లేదని, కొండాకు ఓటేసి వృథా చేసుకోరాదని, బీసీబిడ్డ కాసానిని గెలిపించి గెలిపించి అభివృద్ధి ఆస్వాదించాలని అభ్యర్థించారు.

బీసీవాదాన్ని బలపరుద్దాం

కుల్కచర్ల: బీసీవాదాన్ని బలపరుస్తూ బహుజన బిడ్డ బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, మఠం రాజశేఖర్ పిలుపునిచ్చారు. చౌడాపూర్ మండల పరిధి మందిపల్ గ్రామంలో ఉపాధిహామీ పనుల ప్రదేశంలో ప్రచారం చేశారు. బీసీ కులాల కోసం ఉద్యమాలు చేసిన కాసానిని గెలిపించాలని కూలీలను కోరారు. ఇందులో మాసయ్య ముదిరాజ్ ఉన్నారు.

ఆరు గ్యారంటీలు.. పక్కాగా అమలు

- ఆగస్టులో రూ.2లక్షల రుణమాఫీ
- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు
- చేతి గుర్తుకు ఓటువేసి రంజిత్‌ను గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు



బొంరాస్‌పేట: మెట్లకుంటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ధారూరు: కాంగ్రెస్ పార్టీ చేసేదే చెబుతుందని, శాసనసభ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి అన్నారు. లోకసభ ఎన్నికలో నేపథ్యంలో ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం మండల పరిధి గ్రామాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా.. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు జోరుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం పట్లోళ్ల మాట్లాడారు. చెప్పిన విధంగానే ఆగస్టులో రూ.2లక్షల రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓట్లు వేస్తే వృథా అవుతాయని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీని గెలిపించండి అని అభ్యర్థించారు. ఇందులో నాయకులు బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, బాలప్ప, అవినాశ్‌రెడ్డి, లాల్ మహ్మద్ ఉన్నారు. ఇదిలా ఉండగా మున్నూరుసోమారంలో తెలంగాణ ఉద్యమకారుడు రాంరెడ్డి ప్రచారం చేశారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం

మోమిన్‌పేట: పార్లమెంటు ఎన్నికల్లో చెతి గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌రెడ్డిని బలపరిచి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేద్దామని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య పిలుపునిచ్చారు. మండల పరిధి మొరంగపల్లి, ఎన్కేపల్లి గ్రామాల్లో పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకం ద్వారా వలసలను అరికట్టి, కూలీలకు ఉపాధి కల్పించింది కాంగ్రెస్సేనని స్పష్టం చేశారు. ఇందులో నాయకులు మాణయ్య, ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ ఉన్నారు.

జన జాతరకు..

యాలాల: తాండూరు పట్టణంలో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండల పరిధి గిరిజాపూర్ నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మప్ప ఆధ్వర్యంలో వెళ్లారు. ఇదిలా ఉండగా.. జాతరకు వచ్చే కార్యకర్తలకు.. లక్ష్మీనారాయణపూర్–తాండూరు మార్గంలో కొత్త బ్రిడ్జి సమీపంలో అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమప్ప, యువ నాయకుడు వీరేశం చల్లటి తాగునీటిని పంపిణీ చేశారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి, పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు జయకృష్ణ కోరారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో పార్టీ శ్రేణులు బొంరాస్‌పేట, దుద్యాల పరిధి గ్రామాల్లో జోరుగా ఇంటింటి ప్రచారం చేశారు.

అన్ని స్థానాలు మావే..

కుల్కచర్ల: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని అన్ని స్థానాల్లో భారీ మెజార్టీతో గెలవబోతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల నుంచి తాండూరులో జరిగిన జనజాతర సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ పట్ల ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తుంటే.. ఎంపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారన్న నమ్మకం ఏర్పడిందని స్పష్టం చేశారు.

ప్రజా సేవలో రంజిత్

మర్పల్లి: ఐదేళ్ల పదవీ కాలంలో ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రజలకు ఎంతో సేవ చేశారని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ఉంటే దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. చేతి గుర్తుకు ఓటు వేసి, రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాచన్న, మండల ఉపాధ్యక్షుడు సలీం ఉన్నారు.



పరిగి: ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

కూటమికి ప్రజాదరణ

ధారూరు: ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ ఓటర్లను కోరారు. మండల పరిధి తరిగోపులలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి లభిస్తున్న ప్రజాదరణ చూస్తుంటే కేంద్రలో కాంగ్రెస్ సర్కార్ కొలువు దీరడం తథ్యమని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు బుజ్జయ్యగౌడ్, బాబాఖాన్, అశోక్ ముదిరాజ్, గఫార్, కిషోర్ ఉన్నారు.

అధికారం ఖాయం

పరిగి: దేశంలో ఎక్కడికి వెళ్లినా హస్తం గాలి వీస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. పట్టణ కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. పేదలకు చేసిందేమీ లేదని, న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. కావున ప్రతి ఒక్కరు చేతి గుర్తుకు ఓటువేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పార్టీ నాయకులు జగన్, నిఖిల్‌రెడ్డి, విద్యాసాగర్ ఉన్నారు.

రంజిత్‌ను ఆదరించండి

అనంతగిరి: గిరిజనులు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాఘవన్ నాయక్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన వికారాబాద్ మండల పరిధి పలు తండాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే దేశ వ్యాప్తంగా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు చందర్‌నాయక్, పాండునాయక్, రమేష్, శేఖర్ ఉన్నారు.